

నేడు రంగవల్లుల

పోటీలు

హిందూపురం, జనవరి 5: ఏబీఎన్-ఆంధ్రజ్యోతి అభిమాన పాటకులైన నారీమణుల కోసం శనివారం హిందూపురంలో ముత్యాల ముగ్గుల పోటీలు జరగనున్నాయి. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన సారథ్యంలో ఎన్‌బీకే సేవాసమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే పోటీలు ఉదయం 9.30గంటలకు ప్రారంభం అవుతాయి. పట్టణంలోని ఎంజీఎం క్రీడామైదానంలో ఈ పోటీలు జరగనున్నాయి. మధ్యాహ్నం న్యాయ నిర్ణేతలు విజేతలను ఎంపిక చేస్తారు. విజేతలకు ఎమ్మెల్యే బాలక్రిష్ణ సతీమణి వసుందరా దేవి చేతులమీదుగా బహుమతులు అందజేయనున్నారు.

ఉద్యమం ఉద్రిక్తం!

పురంలో చెత్త తరలింపును అడ్డుకున్న పారిశుధ్య కార్మికులు

తీవ్ర వాగ్వాదం.. తోపులాట..

ఇద్దరు మహిళా కార్మికులకు గాయాలు..

స్పృహతప్పి పడిపోయిన ఒకరు..

హిందూపురం, జనవరి 5: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మునిసిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె హిందూపురంలో ఉద్రిక్తంగా మారింది. రక్తం చిందించింది. 11వ రోజు శుక్రవారం ఉదయం రెగ్యులర్ పారిశుధ్య కార్మికులు పనులు చేపట్టేందుకు గాంధీసర్కిల్ వద్దకు చేరుకున్నారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు సైతం అక్కడకు చేరుకుని, వారిని అడ్డుకున్నారు. పోలీసులు.. సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో పనులు చేపట్టేందుకు వెళ్లినా పారిశుధ్య కార్మికులు తీవ్రంగా ప్రతిఘటించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల యూనియన్ నాయకులను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా.. మహిళా కార్మికులు కవచంగా ఏర్పడి అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, కార్మికుల మధ్య గంటపాటు వాగ్వాదం, తోపులాట సాగింది. కొంతమంది మహిళా కార్మికులు.. పోలీసులను వెనక్కు నెట్టేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా ఇద్దరు మహిళా కార్మికులకు గాయాలయ్యాయి. ఒకరు స్పృహతప్పి పడిపోయారు. సీఐటీయూ నాయకులు జగదీశ్, లక్ష్మణ్‌తోపాటు 12 మందిని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై వదిలేశారు.



స్పృహతప్పిన మహిళా కార్మికురాలి వద్ద నిరసన



చేతికి అయిన గాయాన్ని చూపుతున్న మహిళా కార్మికురాలు

యూనియన్ నాయకుల అరెస్టు
పోలీసు జీపుకు అడ్డంగా బైఠాయించిన మహిళా కార్మికులు
సచివాలయ సిబ్బంది కవచంగా పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులకు కవచంగా ఏర్పడిన సచివాలయ సిబ్బంది

కవచంలా సచివాలయ సిబ్బంది

గాంధీ సర్కిల్‌లో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేసేందుకు వెళ్లిన రెగ్యులర్ సిబ్బందిని అడ్డుకునేందుకు కాంట్రాక్టు కార్మికులు ప్రయత్నించారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నం చేశారు. చేతకాకపోవడంతో సచివాలయ సిబ్బంది అక్కడికి చేరుకుని.. రెగ్యులర్ కార్మికులకు అండగా పారిశుధ్య పనులు చేపట్టేందుకు కవచంలా ఏర్పడ్డారు. చుట్టూ మానవహారంగా నిలబడ్డారు.

జీపునకు అడ్డంగా బైఠాయింపు

యూనియన్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని, స్టేషన్‌కు తరలిస్తుండగా మహిళా కార్మికులు అడ్డుగా బైఠాయించారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు గాంధీ సర్కిల్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి. టూటౌన్ పోలీసు స్టేషన్‌లో పనిచేసే ఓ మహిళా కానిస్టేబుల్‌కు కూడా గాయాలైనట్లు సమాచారం.



పోలీసు వాహనానికి అడ్డంగా బైఠాయించిన మహిళా కార్మికులు



స్పృహ తప్పి పడిపోయిన మహిళా కార్మికురాలు



కార్మిక నేతను లాక్కెళ్తున్న పోలీసులు

జగన్ డౌన్.. డౌన్..

సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన తెలుపుతుంటే పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి తమపై జులుం ప్రదర్శించడం ఏంటని సీఐటీయూ నాయకులు విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు ఇచ్చిన హామీలు నెరవేర్చమని అడిగితే పోలీసులతో కొట్టిస్తారా అంటూ మండిపడ్డారు. ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు రోడ్డుపై బైఠాయించి జగన్ డౌన్.. డౌన్.. అంటూ నినాదాలు చేశారు.

సోమందేపల్లిలో ఒంటికాలిపై నిలబడి అంగన్‌వాడీల నిరసన



భగీరథుడిలా ఉద్యమిస్తాం

అంగన్‌వాడీల ఉద్ఘాటన
ఒంటికాలిపై నిలబడి నిరసన

పుట్టపర్తి రూరల్, జనవరి 5: సమస్యలు పరిష్కరించేదాకా వెనక్కి తగ్గేదేలేదనీ, భగీరథుడిలా ఉద్యమిస్తామని అంగన్‌వాడీలు ఉద్ఘాటించారు. జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరుకుంది. సోమందేపల్లిలో అంగన్‌వాడీలు.. భగీరథుడి వలె ఒంటి కాలిపై నిలబడి తపసు చేస్తున్నట్లు నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ముందు గంగిరెద్దుకు తమ సమస్యలను చెబుతూ నిరసన తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఆందోళనలు కొనసాగించారు.

2,617 మందికి నవరత్నాల లబ్ధి

పుట్టపర్తి, జనవరి 5: జిల్లాలో అర్హులై ఉండి కూడా నవరత్నాల ద్వారా లబ్ధిపొందని 2,617 మందికి ఆయా పథకాల కింద రూ.4.15 కోట్లు మంజూరైనట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. అందుకు సంబంధించిన మెగా చెక్కును శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హత ఉండి గతంలో పలు కారణాలతో పథకాలు అందని లబ్ధిదారులను గుర్తించి వారికి నేరుగా బ్యాంకు ఖాతాలోకి నిధులు జమ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సచివాలయ నోడల్ అధికారి శివారెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ ఫెయిలవుతానేమోనన్న బెంగతో విద్యార్థి ఆత్మహత్య



విద్యార్థి నవీన్ కుమార్ (ఫైల్)

చిలమత్తూరు, జనవరి 5: డిగ్రీ పరీక్షలు సరిగా రాయలేదనీ, ఫెయిలవుతానేమోనన్న బెంగతో మండలంలోని దళవాయిపల్లికి చెందిన నవీన్ కుమార్ (20) గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. చిలమత్తూరు ఎస్‌ఐ గంగాధర్ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు.. నవీన్‌కుమార్ హిందూపురంలోని సప్తగిరి డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ చదువుతుండేవాడు. ఇటీవల ఇంట్లోనే చదువుకుని ఐదో సెమిస్టర్ పరీక్షలు రాశాడు. పరీక్షలు సరిగా రాయలేదని ఇంట్లో బాధపడినట్లు తండ్రి వెంకటరాజు తెలిపాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి దళవాయిపల్లిలోని ఇంట్లో అందరూ నిద్రించగా.. పక్కనే ఉన్న పాత ఇంట్లోకి వెళ్లి నవీన్‌కుమార్ పైకప్పునకు చీరతో ఉరేసుకుని, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం గుర్తించిన కుటుంబికులు.. పోలీసులకు సమాచారం అందించారు. తండ్రి వెంకటరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమయపాలన తూచ్..!

గాలికొదిలేసిన సచివాలయ ఉద్యోగులు

ప్రజలకు తప్పని తిప్పలు



ఉదయం 10.30 గంటలైనా తెరుచుకోని తనకల్లు సచివాలయం



ఉద్యోగుల కోసం వేచి చూస్తున్న లబ్ధిదారులు

తనకల్లు, జనవరి 5: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయ కార్యాలయం తలుపులు ఉదయం 10.30 గంటలైనా తెరుచుకోలేదు. కార్యాలయ సిబ్బంది 11 గంటలైనా విధులకుహాజరుకాలేదు. ఉదయం 10 గంటలకే పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు.. ఉద్యోగుల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. పర్యవేక్షించాల్సిన గ్రామ సచివాలయ కార్యదర్శులు కూడా సమయానికి రాకపోవడం గమనార్హం. దీంతో సచివాలయ ఉద్యోగులు అడిగి ఆట.. పాడిదే పాటగా మారింది. గ్రామ సర్పంచ్ సరస్వతమ్మ 10 గంటలకే సచివాలయానికి వచ్చినా, తలుపులు తీయకపోవడంతో బయట వేచి ఉండాల్సి వచ్చింది.

నంబుల పూలకుంటలోని ఆర్బీకే





అన్నదాతకు అన్నింటా నిరాశ..!

ఆర్బీకేలతో ప్రయోజనం అంతంతే..

కనిపించని పంట కొనుగోలు కేంద్రాలు
ప్రజాధనం వృథా అన్న విమర్శలు

రైతులకు అవసరమైన ఎరువులు ఆర్బీకేలో లేవు



మూడెకరాల్లో టమోటా సాగు చేశా. పంటకు అవసరమైన డ్రిప్, ఎరువులు ఆర్బీకేలో అందుబాటులో లేవు. మండలకేంద్రానికీ, ఇతర పట్టణాలకెళ్లి డ్రిప్, మందులు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఆర్బీకేలు నామమాత్రంగా మారాయి. ఎవరికి ఉపయోగపడుతున్నాయో అర్థం కావడంలేదు. పంట నమోదు చేస్తున్నారే తప్ప.. ఎరువులు, మందులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు ఏవీ లభించట్లేదు.

- చంద్రశేఖర్ రెడ్డి, రైతు, బత్తినగారిపల్లి

నంబులపూలకుంట, జనవరి 5: రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు భరోసా కేంద్రా (ఆర్బీకే)లు అన్నదాతకు అన్నింటా నిరాశ మిగుల్చుతున్నాయి. ఏమాత్రం భరోసా ఇవ్వలేకపోతున్నాయి. రైతులు పట్టణాలు, మండలకేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ఆర్బీకే భవనాలు ఏర్పాటు చేశామని ప్రభుత్వం ఆర్భాటంగా చెబుతోంది. మండల వ్యాప్తంగా పది ఆర్బీకేలను ఏర్పాటు చేసింది. 9 కేంద్రాలకు ప్రభుత్వ పక్కాభవనాలు ఉండగా, ఒకటి నిర్మాణంలో ఉంది. రైతులు ఎక్కడికీ వెళ్లకుండా ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందుబాటులో ఉండడంతోపాటు, రైతులు పండించిన పంటలను కూడా రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఆర్బీకేల్లో ఎరువులు, మందులు, విత్తనాలు, డ్రిప్ మందులు, వ్యవసాయ పనిముట్లు అందుబాటులో లేవు. ఆర్బీకేల్లో యూరియా, డీఏపీ మాత్రమే ఉన్నాయి. వీటిని అమ్మి ఎంత మేరకు ప్రభుత్వం లాభాలు ఆర్జిస్తుందోకానీ, రైతులకు పెద్దగా ప్రయోజనం లేదన్నది నిర్వివాదాంశం. ఆర్బీకేల్లో ఏవైనా కొనుగోలు చేయాలంటే సిబ్బంది వచ్చే వరకు వేచి ఉండి, తరువాత డబ్బు డిపాజిట్ చేసి, మందులు తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఇంత ప్రయాస పడలేక రైతులు ఫర్టిలైజర్ దుకాణాల్లో కొనుగోలు చేసుకెళ్తున్నారు. రైతులు సాగుచేసిన పంటలకు ఈక్రాప్ బుకింగ్ పేరుతో సీజన్ మొత్తం కాలం వెల్లబుచ్చుతున్నారు. టీడీపీ హయాంలో పంటలు సాగుచేసిన రైతులకు బీమా, పంటనష్టపరిహారంతో పాటు అవసరమైన విత్తనాలు, ఎరువులు సబ్సిడీతో అందించేవారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు కూడా 90 లేదా వందశాతం సబ్సిడీతో పంపిణీ చేసేవారు. వైసీపీ అధికారం చేపట్టాక ఉలవలు, కందులు మాత్రం 90 శాతం సబ్సిడీతో అందించారు.

నీటి వనరుల కొరత

కరువు ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా ఒక్కటి. ఈసారి ఖరీఫ్‌లో వరుణుడు మొహం చాటేశాడు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నీటి వనరులు తక్కువగా ఉండడంతో రైతులకు అనేక రకాల సబ్సిడీలతో బిందు, తుంపర సేద్య పరికరాలు, వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించేవారు. ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభమై రెండునెలలు గడుస్తున్నా, నేటికీ బస్తా వేరుశనగ విత్తనకాయలు ప్రభుత్వం అందించిన పాపాన పోలేదు. గతంలో రైతులు పండించిన వేరుశనగ కాయలను ఆయా ప్రాంతాల్లో కొనుగోలు చేసి, విత్తనశుద్ధి చేయించి, తిరిగి వారికే సబ్సిడీపై అందించేవారు. ఈసారి రైతులకు నాసిరకం విత్తనకాయలు అందించడంతో అనావృష్టి కారణంగా మొలక దశలోనే ఎండిపోయాయన్న ఆరోపణలు అన్నదాతల నుంచే వినిపిస్తున్నాయి. జిల్లా అంతటా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నా.. కొన్ని ప్రాంతాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఆయా మండలాల రైతులకు నేటికీ నష్టపరిహారం అందక ఎదురుచూపులు చూస్తున్నారు. ఈప్రాంతంలో హంద్రీనీవా కాలువ నీటితో చెరువులు నింపితే రైతులు పంటలు సాగుచేసుకోవడానికి అవకాశం ఉండేది. మండలానికి హంద్రీనీవా నీరు రాలేదు. ఖరీఫ్, రబీలో వర్షాలు సకాలంలో కురవకపోవడంతో సాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయింది. గతేడాది 4,500 ఎకరాల్లో సాగుచేస్తే ఈసారి రెండువేల ఎకరాలకు పడిపోయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. రైతులకు పెట్టుబడులకు డబ్బులేక పంటల సాగుకు మొగ్గు చూపడంలేదు. నీటి వనరులు తగ్గిపోవడంతో రైతులు కూలీలుగా మారి, జీవనం సాగిస్తున్నారు.

పంట కొనుగోలు కేంద్రాలెక్కడ?


రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొంటామని పాలకులు గొప్పలు చెప్పారు. మరి ఆ పంట కొనుగోలు కేంద్రాలు ఎక్కడున్నాయో పాలకులే చెప్పాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఖరీఫ్‌లో సాగుచేసిన వరి ప్రస్తుతం చేతికొచ్చింది. మండలంలో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతుల ఇళ్లలోనే మగ్గుతున్నాయి. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తామని చెబుతోందే తప్ప.. ఎక్కడా ఆ పరిస్థితి కనిపించలేదు. ఆర్థికంగా ఇబ్బందులున్న రైతులు.. దళారులు అడిగిన ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది.


ప్రజాధనం వృథా

ఆర్బీకేల పేరుతో రూ.లక్షలు ఖర్చు చేసి భవనాలు నిర్మించి ప్రజాధనాన్ని ప్రభుత్వం వృథా చేసింది. రైతులకు ఉపయోగపడే పనిముట్లు, పంటలకు మందులు, ఎరువులు, విత్తనాలు కేంద్రాల్లో మచ్చుకైనా లేవు. ప్రభుత్వ ఆర్భాటాల కోసం రైతు భరోసా కేంద్రాలను నిర్మించిందే తప్ప.. రైతులకు ఏమాత్రం ఉపయోగపడలేదు. మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి నెలలు గడస్తున్నా నేటికీ పరిహారం అందించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కరువు రైతులను ఆదుకోవాలి.

- నరసింహులు, రైతుసంఘం నాయకుడు









ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

పట్టాల పండుగ

అనంతపురం సెంట్రల్, జనవరి 5: విద్యార్థుల కలలు సాకారం అయ్యేలా శనివారం జేఎన్‌టీయూ 'పట్టా'భిషేకం జరగనుంది. వేడుకలకు వర్సిటీలోని ఎన్‌టీ రామారావు ఆడిటోరియం ముస్తాబు అయ్యింది. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ స్నాతకోత్సవాలకు చాన్స్‌లర్ హోదాలో హాజరుకానున్నారు. 2021-22, 2023 సంవత్సరంలో బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ పూర్తిచేసిన విద్యార్థులకు గవర్నర్ పట్టాలను ప్రదానం చేయనున్నారు. ఉత్తమ మార్కులు సాధించిన 46మంది విద్యార్థులను బంగారు పతకాలతో సత్కరిస్తారు.

భారీ బందోబస్తు...

స్నాతకోత్సవానికి గవర్నర్ రానుండంతో జేఎన్‌టీయూ పరిసరాలను ప్రభుత్వ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గవర్నర్ పర్యటించే ప్రాంతాన్ని ఆర్డీఓ రాణి సుస్మిత అణువణువూ పరిశీలించారు. గెస్ట్‌హౌస్, ఆడిటోరియం, వేదిక ప్రాంగణాన్ని వర్సిటీ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. జేఎన్‌టీయూ నుంచి పాతవూరు సంగమేష్ సర్కిల్ వరకు పోలీసు అధికారులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు పాసులు అందజేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

రిహార్సల్...

13వ స్నాతకోత్సవాల రిహార్సల్స్ శుక్రవారం నిర్వహించారు. గవర్నర్‌ను గౌరవంగా వేదికమీదకు తీసుకెళ్లేందుకు నిర్వహించే ప్రక్రియను వీసీ రంగజనార్దన, రెక్టార్ విజయకుమార్, రిజిస్ట్రార్ శశిధర్‌తోపాటు ఇతర అధికారులతో రిహార్సల్ నిర్వహించారు. వేడుక ప్రారంభించడానికి గవర్నర్ నుంచి తీసుకునే అనుమతి, ప్రసంగాలు. పట్టాలు, మెడల్స్ అందజేయం తదితర ప్రక్రియలను ముందస్తుగా పరిశీలించారు.

నేడు బీకేఎస్‌కు గవర్నర్

బుక్కరాయసముద్రం,: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ మైదానంలో శనివారం జరగనున్న 'వికసిత్ భారత్' సంకల్ప యాత్ర కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్‌నజీర్ పాల్గొననున్నారు. ఇందుకోసం జిల్లా యంత్రాగం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టింది. నాలుగు రోజులుగా జిల్లా కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్ అధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బీకేఎస్ అంతటా పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు. దాదాపు 250 మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొం టున్నట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి తెలిపారు. గవర్నర్ మధ్యాహ్నం 2 గంటలకు బుక్కరాయసముద్రంకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ గౌతమి తెలిపారు. కార్యక్రమంలో తొలుత కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రదర్శన క్షేత్రాలను సందర్శిస్తారని, అనంతరం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 పథకాలకు సంబంధించి మహిళా లబ్ధిదారులుతో నేరుగా గవర్నర్ ముఖాముఖి అవుతారన్నారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి రోడ్డులోకి ఎవ్వరు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

పోలీసులపై బురద జల్లితే ఊరుకోం

ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం క్రైం, జనవరి 5: ప్రజల దృష్టిని మళ్లించేందుకు పోలీసులపై బురద జల్లే ప్రయత్నం చేస్తే చర్యలు తప్పవని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్, టెలిగ్రామ్ తదితర సోషల్ మీడియా వేదికలపై సత్యదూరమైన పోస్టులు పెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. 'అనంతపురం కోవూరు నగర్‌లోని ఓ పార్కులో గంజాయితో ఎంజాయ్' అంటూ ముందు వెనుక ఆలోచించకుండా సోషల్ మీడియా గ్రూపులో పోస్టులు పెట్టారని తెలిపారు. కోవూరు నగర్ పార్కుపైనే కాదు.. జిల్లాలోని అన్ని పార్కులపై ప్రత్యేక నిఘా వేశామని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగకుండా, ఈవ్ టీజింగ్ జరుగకుండా పోలీసులు చర్యలు చేపట్టారని తెలిపారు. గత మూడు నెలలలో 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, 40 మందిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. అనంతపురంతో పాటు గుత్తి, గుంతకల్లు ప్రాంతాలలో ప్రత్యేక నిఘా వేసి, గంజాయితో సంబంధం ఉన్న వారిపై చర్యలు తీసుకున్నామని వివరించారు. పాత వీడియోలను మార్చి, కొత్తగా జరిగినట్లు క్రియేట్ చేసి పోస్టులు పెట్టడం, అసభ్యకరంగా ఉన్న డీప్ ఫేక్ వీడియోలు పెట్టి వేధించడం వంటి పనులు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరిపైన అసత్య ప్రచారాలు చేసినా, తప్పుడు పోస్టులు పెట్టినా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని, చట్టపరమైన కఠిన చర్యలకు ఉపక్రమిస్తామని పేర్కొన్నారు. వ్యక్తిగత దూషణలు, కించపరిచే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఏవైనా సమస్యలు ఉన్నా, ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నా తన ఫోన్ నంబర్‌కు (9440796800) తెలియజేయాలని కోరారు. సోషల్ మీడియాలో వేధిస్తున్నా, సైబర్ మోసాలు జరిగినా వెంటనే 1930 నంబరులో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించడంతో పాటు సమాచారం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

ధర్మవరాన్ని సమస్యలకు నిలయంగా మార్చేశారు

- ఏ కాలనీలో చూసినా ప్రజల కష్టాలే
- రెండో రోజు పాదయాత్రలో పరిటాల శ్రీరామ్
- గాలి మాటలను నమ్మొద్దు.. ధర్మవరం శ్రీరామ్‌దే
- మాజీ మంత్రి పరిటాల సునీత

ధర్మవరం, జనవరి 5: ధర్మవరం పట్టణాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి సమస్యలకు నిలయంగా మార్చేశారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాచైతన్య పాదయాత్రలో భాగంగా రెండోరోజు శుక్రవారం పరిటాల శ్రీరామ్ పట్టణంలోని పలు కాలనీల్లో పర్యటించారు. ఉదయం శాంతినగర్‌లోని గ్యాస్ గౌడౌన్ వద్ద ప్రారంభమైన పాదయాత్ర శాంతినగర్, చంద్రబాబునగర్, శారదానగర్, శివానగర్, తిక్కస్వామినగర్, సీపీఐకొట్టాల, కేశవనగర్, 17వవార్డు సంజయ్‌నగర్ వరకు సా గింది. ఈ సందర్భంగా పలు కాలనీల్లో ప్రజలు మగ్గాల వల్ల తమకు ఏ మాత్రం గిట్టుబాటు కావడంలేదని, నిరుద్యోగ సమస్య, డ్రైనేజీ, రోడ్ల సమస్యలను శ్రీరామ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో ఎంతోమందికి రేషన్‌కార్డులు తొలగించారని, అర్హత ఉన్నా వృద్ధాప్య వితంతు పింఛన్‌లు అందడం లేదన్నారు. ప్రతి బాధితులు వద్ద ఫోన్ నెంబర్ తీసుకుని, టీడీపీ అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

● కొందరు మైనార్టీ నేతలు పరిటాల శ్రీరామ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వక్ఫ్‌ఆస్తుల పరిరక్షణ, ముస్లింలను వివక్షకు గురికాకుండా అట్రాసిటీ చట్టం, దుల్హన్ పథకం సొమ్ము రూ.లక్ష వరకు పెంచాలని, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు, 50శాతం సబ్సిడీతో రుణాలువంటి అంశాలను శ్రీరామ్ దృష్టికి తెచ్చారు. వీటిపై చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని, మొదటి నుంచి ముస్లిం మైనార్టీలకు పరిటాలరవితో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. వారి అభిమానాన్ని నిలుపుకుంటామన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

శ్రీరామ్ పాదయాత్రలో భాగంగా 5వ వార్డుకు వచ్చిన సమయంలో వైసీపీలో కీలకంగా పనిచేస్తున్న 30 మంది యువకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వార్డులోకి రాగానే పలువురు యు వకులు భారీ స్వాగతం పలికారు. అనంతరం వారందరినీ శ్రీరామ్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలోనే యువత భవిష్యత్తు బాగుంటుందన్న ఉద్దేశంతోనే తాము పార్టీలోకి చేరినట్లు పేర్కొన్నారు. పార్టీలోకి చేరిన వారిలో నిజాం, అరవింద్, మహమ్మద్, కుల్లాయి, మనీ, ప్రశాంత్‌రెడ్డి, యతీహ్, వెంకటేశ్ తదితరులున్నారు.

టీడీపీజెండా ఎగురవేసేది శ్రీరామే - మాజీ మంత్రి సునీత

కార్యకర్తలు గాలి మాటలు నమ్మవద్దని, ధర్మవరంలో టీడీపీ జెండా ఎగురవేసేది పరిటాలశ్రీరామే అని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. రెండోరోజు పాదయాత్రలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ..పరిటాలశ్రీరామ్ పాదయాత్రకు మంచి స్పందన కనిపిస్తోందన్నారు. అన్ని వర్గాల వారు ఆయనను కలిసేందుకు వస్తున్నారన్నారని, సమస్యలను నోట్ చేసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. పరిటాల రవి కుటుంబంతో ధర్మవరం ప్రాంతానికి ఎంతో అనుబంధం ఉందని శ్రీరామ్‌ను ఒక మనవడిలా అన్నలా, తమ్ముడిలా ప్రజలు భావిస్తున్నారన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పరిటాల శ్రీరామ్, పరిటాల సునీత

పంప్‌హౌస్‌కు తాళం

● శ్రీరామిరెడ్డి కార్మికుల ఆందోళన ఉధృతం

కళ్యాణదుర్గం, జనవరి 5: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు తమ ఆందోళన ఉధృతం చేశారు. ఈక్రమంలోనే శుక్రవారం పంప్‌హౌస్‌కు తాళాలు వేసి, బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 15 ఏళ్లుగా ఈ పథకంలో పనిచేస్తున్నామని నెలనెలా జీతాలు, ఇతరత్రా ప్రయోజనాలు కల్పించడంలో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని వారు వాపోయారు. ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలి అని, జీతాలు, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, పలు వినూత్న నిరసనలు చేస్తున్నారు. ఫేజ్-4 కింద ఉన్న కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో 225 మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. 325 గ్రామాలకు తాగునీటి సరఫరా ఆగి పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


నినాదాలు చేస్తున్న కార్మికులు

వారు లంచం అడిగారు : ఏసీబీ డీఎస్పీ



చెన్నేకొత్తపల్లి, జనవరి 5: కులాంతర వివాహ వివాదం కేసులో లంచం డిమాండ్ చేసిన రామగిరి సీఐ చిన్నగౌస్, కనగానపల్లి ఎస్ఐ హనుమంతరెడ్డిలపై ఆధారాలు రుజువయ్యావని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అనంతపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ వెంకటాద్రి తెలిపారు. సీకేపల్లి పోలీస్టేషన్‌పై గురువారం ఏసీబీ అధికారులు దా డులు నిర్వహించడంతో సీఐ పారిపో గా కనగానపల్లి ఎస్ఐను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. వివరాలను శుక్రవారం విలేకరులకు ఏసీబీ డీఎస్పీ వెల్లడించారు. కనగానపల్లి మండలంలో దం పతుల మధ్య విభేదాలకు సంబంధించి తగరకుంటకు చెందిన వడ్డే నరేశ్‌పై కేసు నమోదు కాగా దాని మాఫీ కోసం సీఐ, ఎస్ఐలు లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీని సంప్రదించారన్నారు. ఒప్పందం ప్రకారం సీకేపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి డబ్బును అందజేస్తుండగా, ఏసీబీ అధికారులను పసిగట్టి సీఐ పారిపోయాడని తెలిపారు. ఎస్ఐ హనుమంతరెడ్డి కూడా సీఐ ద్వారా విషయం తెలుసుకుని పారిపోతుండగా, వెంబడించి అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. విచారణలో సీఐ, ఎస్ఐలు నేరం చేశారని రుజువు అయ్యిందని తెలిపారు. ఎస్ఐ హనుమంతరెడ్డిని అరెస్టు చేసి, కర్నూలు ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టామని, పరారీలో ఉన్న సీఐ చిన్నగౌస్ కోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. సీఐ, ఎస్ఐ విషయంలో ఎవరైనా బాధితులుంటే ఏసీబీని సంప్రదించవచ్చన్నారు.

తిరుపతి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు

గుంతకల్లు, జనవరి5: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తిరుపతి-సికింద్రాబాద్ మధ్య సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలు (నెం. 07065)ను నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. ఈ రైలు తిరుపతిలో ఈనెల 10న ఉదయం ఐదున్న ర గంటలకు బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తిరుపతి, గుత్తి, డోన్, కర్నూలు సిటీ, గద్వాల, వనపర్తి రోడ్డు, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, ఉందానగర్, కాచిగూడ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

తనిఖీల్లో పట్టుబడ్డ రూ. 17.95 లక్షలు

డీ.హీరేహాళ్, జనవరి 5: జిల్లా ఎస్పీ ఆదేశాలతో కర్ణాటక సరి హద్దు చెక్ పోస్టుల వద్ద సెబ్, పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా నగదు పట్టుబడింది. సెబ్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు బళ్లారి నుంచి బెంగళూరుకు ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 17.95 లక్షల నగదును సీజ్ చేసినట్లు సెబ్ అదనపు ఎస్పీ జీ రామకృష్ణ తెలియజేశారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాలతో కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద సెబ్ విభాగం, పోలీసులు తనిఖీలు చేపట్టారు. సెబ్ అదనపు ఎస్పీ జీ రామకృష్ణ, డీ.హీరేహాళ్ ఎస్ఐ రంగడు యాదవ్, సెబ్ ఎస్ఐ వీరస్వామిల ఆధ్వర్యంలో సెబ్, పోలీసులు ఓబుళాపురం చెక్‌పోస్ట్ వద్ద బళ్లారి నుంచి బెంగళూరు వెళుతున్న ఓ కారుని తనిఖీ చేశారు. తమిళనాడులోని హోసూరు జిల్లా శూలగిరిలో ఉన్న సోనాజీ ఇండస్ట్రీస్, మహావీర్ ఎక్స్‌పోర్ట్ కంపెనీ యజమాని హరిరామ్, అతని మిత్రుడు బెంగళూరు రవి అరోరాలు కారులో ఉన్నారు. డబ్బుకు వారు ఎ లాంటి బిల్లులు చూపించకపోవ డం వల్ల ఆ డబ్బుని సీజ్ చేసి ఐటీ శాఖకు పంపుతున్నామని సెబ్ అదనపు ఎస్పీ వెల్లడించారు.


పట్టుబడ్డ నగదును చూపుతున్న అదనపు ఎస్పీ రామకృష్ణ

దళారీ వాహనాన్ని అడ్డుకున్న గ్రామస్థులు

కణేకల్లు, జనవరి 5: మండలంలోని మాల్యం గ్రామానికి చెందిన పప్పుశనగ దళారీ తిప్పారెడ్డికి సంబంధించిన పప్పుశనగ విత్తనాల వాహనాన్ని గ్రామస్థులు శుక్రవారం అడ్డుకుని గొడవకు దిగారు. మాల్యం గ్రామానికి చెందిన తిప్పారెడ్డి ప ప్పుశనగ వ్యాపారం చేస్తూ దాదాపు 65 మంది రైతులకు రూ.5.5 కోట్లు ఐపీ పెట్టి, ఇటీవల నోటీసులు కూడా పంపించా డు. గ్రామం వదలి పరారయ్యాడు. దీంతో అతడి పొలంలో పండిన పప్పుశనగను అదే గ్రామానికి చెందిన మరేగౌడ అనే వ్యక్తి కోత కోయించి, 169 సంచుల్లో వాహనంలోకి ఎక్కించి వేరే చోటికి తరలించేందుకు శుక్రవారం ప్రయత్నించాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న తిప్పారెడ్డి బాధితులు మాల్యంకు చేరుకుని ఆ వాహనాన్ని పట్టుకున్నారు. దీంతో మరేగౌడ తాను తిప్పారెడ్డి పొలాన్ని కౌలుకు చేశానని ఇది తనవేనని బుకాయించేందుకు ప్రయత్నించాడు. గ్రామస్థులు ససేమిరా అనడంతో పోలీసులు రంగప్రవేశం చేశా రు. సంచుల విలువ రూ. ఐదు లక్షలు ఉంటుందని, వేర్‌హౌస్‌లో ఉంచాలని పోలీసులు, పెద్దలు తీర్మానించడంతో సమస్య సద్దుమణిగింది.


వాహనాన్ని అడ్డుకుంటున్న గ్రామస్థులు

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం అర్బన్, జనవరి 5 : పశువుల షెడ్ల నిర్మాణం కోసం పాడి రైతులు దరఖాస్తు చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం శుక్రవారం ప్రకటించారు. ఉపాధి హామీ పథకం నిధులతో షెడ్ల నిర్మాణం చేపడ్తామని, రెండు పాడి పశువుల షెడ్ల నిర్మాణం కోసం రూ.లక్ష, 4 పాడి పశువుల షెడ్ల కోసం రూ.1.50 లక్షలు, 6 పాడి పశువుల కోసం రూ.1.80 లక్షలు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు.పాడి రైతులు స్థానిక వెటర్నరీ ఆస్పత్రుల్లో అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకుని, పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జాబితా విడుదల

అనంతపురం టౌన్ జనవరి 5 : జిల్లా వైద్య శాఖ పరిధిలో భర్తీ చేయనున్న కాంట్రాక్ట్ వైద్యపోస్టులకు అభ్యర్థుల ఫైనల్ మెరిట్ జాబితాను విడుదల చేశామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీటీసీ విభాగానికి సంబంధించి ఒక మెడికల్ ఆఫీసర్ పోస్టు, ఒక జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పోస్టు, ఒక టీబీహెచ్‌ఐవీ సూపర్‌వైజర్‌పోస్టు, ఒక జిల్లా పీపీఎంకోఆర్డినేటర్ పోస్టు, ఒక అకౌంటెంట్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచామని, ఎంపికైన అభ్యర్థులు ఈనెల 8వతేదీన తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో జిల్లా వైద్యశాఖ కార్యాలయానికి రావాలని డీఎంహెచ్‌ఓ తెలిపారు.

పుట్టపర్తిలో భవిష్యత్తుకు గ్యారెంటీ


కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

పుట్టపర్తి రూరల్, జనవరి5: పట్టణంలో శుక్రవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టో పథకాల గురించి వివరించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో వస్తే అన్ని వర్గా ప్రజలకు మేలు జరుగుతుందని తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సామకోటి ఆదినారాయణ, ఆరోవార్డు ఇన్‌చార్జి బేకరినాయుడు, నాయకులు బద్రీనాథ్‌చౌదరి, యశ్వంత్, లింగప్పగారిపల్లి రవి, గంగాధర్, బాబ్జాన్, బాషా, వెంకటేసు కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరం

ధర్మవరం, జనవరి 5: చదువుతో పాటు క్రీడలు చాలా అవసరమని ఆత్మీయట్రస్టు ఛైర్మన్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో శుక్రవారం అండర్-12 వ విభాగంలో బాస్కెట్‌బాల్ జిల్లా స్థాయి లీగ్ పోటీలు నిర్వహించారు. వీటిని శెట్టిపి జయచంద్రారెడ్డితో పాటు బాస్కెల్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులకు చదువు ఎంత అవసరమో క్రీడలు అంతే అవసరమన్నారు. క్రీడలు మానసిక, ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. ఈ పోటీలు ఆర్డీటీ, లీగల్ క్లబ్ సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ధర్మవరం బాలబాలికల జట్లతోపాటు అనంతపురానికి చెందిన ఎస్‌ఎస్‌బీఎన్ స్కూల్ బాలబాలికలు జట్లు, ఇండోర్ స్టేడియం బాల బాలికల జట్లు, బుక్కరాయసముద్రం జట్లు పాల్గొన్నాయి. పోటీల అనంతరం బాలికల విభాగంలో ధర్మవరం బాలికల జట్టు, బాలుర విభాగంలో ధర్మవరం బాలుర జట్టు విజేతలుగా నిలిచాయి. రొటేషన్ పద్ధతిలో ఈ లీగ్ పోటీలు తిరిగి అనంతపురంలోని ఇండోర్‌స్టేడియంలో జరుగుతాయి. కార్యక్రమంలో కోచ్‌లు సంజయ్, నరేంద్ర పాల్గొన్నారు.

బైజూస్ ఒప్పందాన్ని రద్దు చేయాలి: ఏఐఎస్ఎఫ్

కదిరి అర్బన్, జనవరి 5: రాష్ట్ర ప్ర భుత్వం బైజూస్‌తో ఏర్పాటు చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం పట్టణంలోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 8వతరగతి విద్యార్థులకు మూడేళ్లనుంచి ట్యాబ్‌లు పంపిణీ చేస్తోందని, ఈపంపిణీకి రూ.3,500 కోట్లు బైజూస్‌తో ఒప్పందం చేసుకుందని తెలిపారు. బైజూస్ వారు నాసిరకమైన ట్యాబ్‌లు అందించి, రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారని అన్నారు. కనుక ఆ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, కిరణ్‌కుమార్‌రెడ్డి, హరీష్, దేవేంద్ర తదితరులు ఉన్నారు.

వజ్రోత్సవ వాల్‌పోస్టర్ల విడుదల

కదిరి అర్బన్, జనవరి 5: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) 75 వసంతాల వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేద్దామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామమోహన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఈ మేరకు వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు చెన్నక్రిష్ణ, క్రిష్ణానాయక్, వేమనారాయణ, సురేష్, ఓబులరెడ్డి, శ్రీనివాసులు,సురేష్, రమణారెడ్డి, సుబ్బిరెడ్డి, ఎస్‌టీయూ నాయకులు ఆపిఫ్, జవహర్, చక్రపాణి శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నాయకుడి జన్మదిన వేడుకలు


కేక్‌కట్ చేస్తున్న సాలక్కగారిశ్రీనివాసులు

కొత్తచెరువు, జనవరి 5: మండలకేంద్రంలో శుక్రవారం టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి సాలక్కగారి శ్రీనివాసులు జన్మదిన వేడుకలను ఆ పార్టీనాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడే అభిమానులు ఏర్పాటుచేసిన కేక్‌ను సాలక్కగారి శ్రీనివాసులు కట్ చేసి అందరికీ పంచారు. తర్వాత బాలుర ఉన్నతపాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. నాయకులు సప్లయర్స్ రామ్మోహన్, సుబ్రమణ్యం, సైకిల్‌షాపు బాబా, కిలారిశ్రీనాథ్, వెంకటేష్, రాహుల్‌చౌదరి, నల్లమాడ శంకర, నాని, చికెన్‌సెంటర్ వెంకటేష్, లోచర్లసత్తి, టెంకాయల కేశవ, వంశీకిశోర్, రాజు, కోట చలపతి, హిదయ్‌తుల్లా, రాధమ్మ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ విగ్రహావిష్కరణకు తరలిరండి

గాండ్లపెంట, జనవరి 5: ఆంగ్లేయులపై తిరుగుబాటు చేసిన పాలెగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం అనంతపురంలోని ఆర్ట్సకళాశాల వద్ద ఆదివారం జరగనుందని, ప్రతిఒక్కరూ హాజరుకావాలని రెడ్డి సంఘం మండల నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు మండలకేంద్రంలో శుక్రవారం కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ కార్యక్రమానికి రెడ్డికులస్థులతో పాటు ప్రతిఒక్కరూ రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజారెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

గాండ్లపెంట, జనవరి 5: ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగంపై మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోనూ, మండలంలోని చామాలగొంది గ్రామంలోనూ శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ రవి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ యంత్రాల ద్వారా ఓటు వేసే విధానాన్ని చూపించారు. అభ్యర్థుల గుర్తులపై ఎలా బటన్ నొక్కాలో వివరించారు. ఈవీఎం పనితీరు చూపించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ నరేంద్ర, వీఆర్‌ఓలు చంద్రశేఖర్‌రెడ్డి, జయరాములు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నేడు బహుమతుల ప్రదానం

కొత్తచెరువు, జనవరి 5: మండలకేంద్రంలో గత డిసెంబరు 17వ తేదీన వర్ధన్యా జన సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో విద్యార్థులకు ప్రతిభా పరీక్షలను నిర్వహించారు. వీటిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను శనివారం స్థానిక జూనియర్ కళాశాల క్రీడామైదానంలో అందజేయనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు పడపాటి అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీఈఓ మీనాక్షి, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ విశాల ఫెర్రర్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, హెచ్‌సీఎల్ టెక్నాలజీ ప్రెసిడెంట్ విజయానంద్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి, కొత్తచెరువు సీఐ రాగిరి రామయ్య, పర్యావరణవేత్త ఎస్‌కే లెనిన్ హాజరుకానున్నట్లు ఆయన చెప్పారు.

చంద్రబాబు అధికారంలోకి రాగానే

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

● పరిటాల శ్రీరామ్ ● మున్సిపల్ కార్మికుల సమ్మెకు సంఘీభావం

ధర్మవరం, జనవరి 5: చంద్రబాబు అధికారంలోకి రాగానే మున్సిపల్ కార్మికుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హామీ ఇచ్చారు. 11రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికుల కు ఆయన సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ...కార్మికులు సమస్యల పరిష్కారం కోసం సమ్మెచేయడంతో ఏ కాలనీలో చూసినా చెత్తమయంగా మారినా, సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. దు ర్వాసనతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, ప్రభు త్వం తక్షణమే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు.


కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న పరిటాల శ్రీరామ్

అంగన్‌వాడీలపై

● ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న మండిపాటు
● 25వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

ప్రభుత్వం కక్షపూరిత వైఖరి

ధర్మవరం, జనవరి 4: అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఏపీరైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న మండిపడ్డారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 25వ రోజుకు చేరింది. వారు ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లిపెద్దన్న, సీఐటీయూ మండల అధ్యక్షుడు ఆదినారాయణ సంఘీబావం తెలిపారు. జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ..25 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. పైపెచ్చు వారిపై కక్షసాధింపుచర్యలకు ప్రయత్నిస్తోందన్నారు. ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీవర్కర్లు సరస్వతి, చంద్రకళ, పోతక్క, దీనా, గోవిందమ్మ, మాంచాలనిదేవి, అనిత, కృష్ణవేణి, భువనేశ్వరి, లలిత పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండలకేంద్రంలో అంగన్‌వాడీలు గోవింద నామస్మరణతో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆ వేంకటేశ్వరస్వామి అయినా ప్రభుత్వానికి కళ్లు తెరిపించి తమ సమస్యలను పరిష్కరించేలా చూడాలని వేడుకున్నారు.

ఓబుళదేవరచెరువు : మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్‌లో గల సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు వినూత్న నిరసన తెలిపారు. కళ్లకు గంతలు కట్టుకుని, మోకాళ్లపై నిలబడి సీఎం జగన్‌కు దండం పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు ఆశీర్వాదమ్మ, సీఐటీయూ నాయకుడు కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని, మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. వీరికి టీడీపీ, తెలుగుయువత మండల నాయకులు బుట్టనాగభూషణనాయుడు, మైలే రామచంద్ర, ప్రసాద్‌రెడ్డి, ఓబులరెడ్డి, మణికుమారి తదితరులు మద్దతు తెలిపారు.

నంబులపూలకుంట : మండలకేంద్రంలోని బస్ షెల్టర్ వద్ద అంగన్‌వాడీలు సమ్మెకొనసాగించారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె విరమించేదిలేదని స్పష్టం చేశారు.

నల్లచెరువు: మండలకేంద్రంలోని వేమన ఆలయం వద్ద అంగన్‌వాడలు సమ్మె కొనసాగించారు. కార్యక్రమంలో కార్యకర్తలు సరస్వతి, పద్మావతి, కుళ్లాయమ్మ, లలితమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

తనకల్లు: మండలంకేంద్రంలోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో అంగన్‌వాడీలు సాష్టాంగ నమస్కారం చేసి వినూత్న నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు వేమన్న, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు భాగ్యమ్మ, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.


ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


ఓడీసీలో కళ్లకు గంతలు కట్టుకుని దండం పెడుతూ నిరసన..


నల్లమాడలో మోకాళ్లపై నిలబడి నిరసన..


తనకల్లులో చౌడేశ్వరీ అమ్మవారికి సాష్టాంగ నమస్కారం..


నంబులపూలకుంటలో సమ్మె..


ముదిగుబ్బలో..


నల్లచెరువులో ..

సమస్యలు పరిష్కరించేవరకు పోరాటం ఆగదు

● స్పష్టం చేసిన మున్సిపల్ కార్మికులు ● 11వ రోజుకు చేరిన సమ్మె ● పొర్లు దండాలతో నిరసన


పుట్టపర్తిలో పొర్లుదండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు


కదిరిలో..


ధర్మవరం మున్సిపల్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన..

పుట్టపర్తి, జనవరి 5: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించేవరకు పోరాటం ఆపేది లేదని పట్టణంలోని మున్సిపల్ కార్మికులు స్పష్టం చేశారు. వారు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 11వరోజుకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ తమకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, పనిముట్లు, బట్టలు, సబ్బులు, గ్లౌజులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మీనారాయణ, గంగాధర్, బాబావలి, కార్మిక నాయకులు నాగార్జున, రామయ్య, నరసింహులు, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం : పట్టణంలో మున్సిపల్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట రోడ్డుపై మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. అలాగే పొర్లు దండాలు పెట్టారు. సీఐటీయూ మండల ప్రధానకార్యదర్శి అయూబ్‌ఖాన్ మద్దతు తెలిపి మాట్లాడారు. కార్మికులకు ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికసంఘం, ఔట్‌సోర్సింగ్‌ఇంజనీరింగ్ విభాగపుఉద్యోగ కార్మికసంఘం ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: త మసమస్యలు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు పొర్లు దండాలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు జనార్ధన్, రాజు, సూరి, రామాంజులతో పాటు సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సమస్యలు చర్చకు వచ్చేనా?

● నేడు ఆర్డీఓ ఆధ్వర్యంలో సమావేశం


గేమేనాయక్ తండా వద్ద రోడ్డును స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకుంటున్న గ్రామస్థులు (ఫైల్)

తనకల్లు, జనవరి 5: నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం కదిరిలో ఆర్డీఓ ఆధ్వర్యంలో సమావేశం జరగనుంది. అయితే ఈ సమావేశంలో అయినా తాము ఎదుర్కొంటున్న సమస్యలు చర్చకు వచ్చేనా అని మండలంలో పలువురు ఎస్సీఎస్టీలు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా గేమేనాయక్‌తండా, పోమేనాయక్ తండా వద్ద రహదారి నిర్మాణం లేకపోవడంతో.. గిరిజనులే చేయి చేయి కలిపి ప్రభుత్వం కోసం ఎదురు చూడకుండా రోడ్డు నిర్మాణాన్ని తమ వ్యవసాయ భూముల్లో చేపట్టారు. అయితే మరో రైతు తన వ్యవసాయ భూమిలో ఒకపక్కన రోడ్డు వేయడంతో ఆగ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు 11మంది గిరిజనులపై కేసు నమోదు చేశారు. ఈవిషయంలో ఇప్పటికే పలుమార్లు గేమేనాయక్‌తండా, పోమేనాయక్ తండాల ప్రజలు రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయడంతో పాటు ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. ఈ సమావేశంలో తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందా అని ఆ తండాల వాసులు ఎదురు చూస్తున్నారు. అలాగే మండలంలోని ఈతోడు, ఎర్రచెరువుపల్లి, సీఆర్‌పల్లి, బొంతలపల్లి తదితర దళితవాడల్లో శ్మశానవాటికలు లేక దళితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారు కూడా ఈ సమావేశంలో తమ సమస్యలు చర్చకు వస్తా యా, అధికారులు తమ సమస్యలపై చర్చిస్తారా అని వేచి చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందిం చి ప్రత్యేకంగా ఎస్సీఎస్టీల కోసం నిర్వహిస్తున్న సమావేశాల్లో వారి వారి సమస్యలకు పరిష్కారం చూపాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రేపు ఉచిత కంటివైద్య శిబిరం

ధర్మవరం, జనవరి 5: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల ఆవరణలో ఆదివారం యువర్స్‌ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు శీలానాగేంద్ర,కార్యదర్శి జయరాం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కరపత్రాలను విడుదలచేశారు. శిబిరంలో కడపకు చెందిన పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

బాలల భవిష్యత్తుకు కృషి చేయాలి

● ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్


పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

పుట్టపర్తి రూరల్, జనవరి 5: బాలల ఉన్నత భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు రాజేంద్ర ప్రసాద్ సూచించారు. జిల్లాకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఇందుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం 18 ఏళ్ల వయసులోపు చిన్నారుల కోసం ఎన్నో సదుపాయాలను కల్పించిందన్నారు. అందుకు పెద్ద మొత్తంలో నిధులు కూడా మంజూరు చేసిందన్నారు. బాలలహక్కుల పరిరక్షణ కోసం పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సత్యసాయి జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ సమితి ఏర్పాటైన నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించామన్నారు. రానున్న రోజుల్లో కలెక్టర్, ఎస్పీ నేతృత్వంలో బాలల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక కార్యచరణ చేపట్టనున్నట్లు వివరించారు. యూఎన్ఓ నిర్దేశించిన ఒడంబడికల మేరకు బాలలకు సంబంధించి జీవించే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, రక్షణపొందే హక్కు, భాగస్వామ్యపు హక్కులపై అవగానహన కలిగి ఉండి సమష్టి కృషితో వాటిని పరిరక్షించాలని పేర్కొన్నారు. బాల్యవివాహాలను, చిన్నారులతో పనిచేయించడాన్ని తీవ్రనేరంగా భావించాలని, అలాంటి వాటిని ప్రోత్సహించే వారిపై కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫోన్లు, బైకులు, టీవీలు, మత్తుపదార్థాల వాడకం వంటివాటికి తల్లిదండ్రులు పిల్లలను దూరంగా ఉంచాలని సూచించారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ రామలక్ష్మి, సభ్యురాలు కామేశ్వరి, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, డిప్యూటీ డీఈఓ రంగస్వామి, సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి శివరంగప్రసాద్, బీసీ వెల్ఫేర్ అధికారిణి నిర్మలా జ్యోతి, గిరిజన సంక్షేమ అధికారి మోహన్‌రాం తదితర జిల్లా స్థాయి అధికారులు కేజీబీవీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాపీహోమ్ సందర్శన

పుట్టపర్తి: పట్టణంలోని విమానాశ్రయం రోడ్డులో ఉన్న హ్యాపీహోమ్‌ను శుక్రవారం ఏపీ మానవహక్కుల కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్ సందర్శించారు. నిర్వాహకురాలు రంజితతో మాట్లాడుతూ.. బాలల న్యాయ చట్టం ప్రకారం వసతి గృహంలో అన్నివసతులు కల్పించాలన్నారు. భోజన వసతి, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లల పట్ల ప్రతిఒక్కరూ మానవతాదృక్పథంతో మెలగాలని, వారికి చేతనైన సాయం అందించాలని ఈ సందర్భంగా సూచించారు. ఆయన వెంట డీసీపీఓ మహేష్, బాలల సంరక్షణ సమితి అధికారులు ఉన్నారు.

డైట్ కళాశాల సందర్శన..

బుక్కపట్నం: మండలకేంద్రంలోని డైట్ కళాశాలను ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ బాలల న్యాయ చట్టం గురించి వివరించారు. బాలలు హక్కులు, చట్టాలపై అవగాన కలిగి ఉండాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణలో యువత భాగస్వాములు కావాలని కోరారు.

వైభవంగా కాలభైరవాష్టమి వేడుకలు

ధర్మవరంరూరల్, జనవరి5: పట్టణంలోని కాలభైరవస్వామి ఆలయంలో శుక్రవారం జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పరమశివుడి అంశంగా జన్మించిన భైరవుడికి ప్రతి ఏటా జన్మాష్టమి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అర్చకులు తెలిపారు. ఉదయం ఆలయంలో అఖండ దివ్యజ్యోతి ప్రవేశం చేశారు. స్వామివారిని రుద్రభైరవ అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

మహిళల ఆర్థికాభివృద్ధిపై శిక్షణ

నల్లచెరువు, జనవరి 5: మండలకేంద్రంలోని ఆంజనేయస్వామి మండల సమాఖ్యలో శుక్రవారం మహిళలు ఆర్థికంగా ఎదగడానికి తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. ఇందులో ఏపీఎంలు వెంకటనారాయణ, రమణప్ప, రమణమ్మ నిరుపేద మహిళలు 2024లో లక్షాధికారులు కావడానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. సీసీలు, మండల సమాఖ్య అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసగించిన సీఎం : తెలుగు యువత



విలేకరులతో మాట్లడుతున్న తెలుగుయువత నాయకులు

పుట్టపర్తి, జనవరి 5: పాదయాత్రలో ప్రతిఏటా జనవరిలో జాబ్‌క్యాలెండర్ విడుదల జేస్తామని గొప్పలు చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక ఉద్యోగం ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేశారంటూ తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు షేక్ బాబ్‌జాన్ విమర్శించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ పాలనలో రెండుమార్లు డీఎస్సీ ద్వారా 18వేలు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. జగన్ మెగా డీఎస్సీ అంటూ ఒక ఉపాధ్యా య పోస్టు కూడా భర్తీ చేయలేదన్నారు. ఉద్యోగ, ఉపాధి లేక రాష్ట్రంలో గతమూడుళ్లలో 21,571 మంది యువత ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు ఓబులరెడ్డి, ప్రధానకార్యదర్శి మాధవ్, నాయకులు శివప్రసాద్‌రెడ్డి, మురళి, సుధీర్, మధుసూదన్‌రెడ్డి, బడా మహేశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో డ్రైవర్ మృతి

బత్తలపల్లి, జనవరి 5: మండలకేంద్రం సమీపంలో శుక్రవారం అనుమానాస్పద స్థితిలో డ్రైవర్ ఆనంద్ (45) మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తాడిమర్రికి చెందిన ఆనంద్ బొలేరో వాహన డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. కాగా గురువారం బొలేరోలో టమోటాలు వేసుకుని మదనపల్లికి వెళ్లాడు. అయితే శక్రవారం ఉదయం బత్తలపల్లిలోని తాడిపత్రి రోడ్డులో గల పెట్రోల్ బంకు సమీపంలో శవమై కనిపించాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్ఐ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. భార్య ఓబుళమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆనంద్ బొలేరో వాహనాన్ని పెట్రోల్ బంకు సమీపంలో నిలిపి సమీపంలోని పొలంలో నిద్రిస్తుంటే ఎవరైనా చంపారా..? లేక ఎక్కడో చంపి మృతదేహాన్ని ఇక్కడికి తెచ్చి పడేశారా..? అనే సందేహాలను పోలీసులు వ్యక్తం చేశారు. మృతదేహాన్ని కొద్ది దూరం లాక్కెళ్లినట్లుగా ఆనవాళ్లు ఉన్నాయి. ఈ కేసును ఛేదించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బుక్కపట్నం, జనవరి 5: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరసింహుడు శుక్రవారం తెలిపారు. కృష్ణాపురానికి చెందిన రవి ఇంటివద్దే కర్ణాటక మద్యం అమ్ముతున్నారన్న సమాచారం అందిందని, దీంతో వెంటనే వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకుని, రెండు ఫుల్‌బాటిళ్లు, 62 టెట్రా ప్యాకెట్ల మద్యంను స్వాధీనం చేసుకున్నామన్నారు. తర్వాత కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

బీసీలకు టీడీపీ అండ

● పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత



మాట్లాడుతున్న సవిత

పెనుకొండ టౌన్, జనవరి 5: బీసీలకు అండ తెలుగుదేశం పార్టీ అని ఆ ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత అన్నారు. ఆమె కార్యాలయంలో శుక్రవారం బీసీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బీసీల ఆత్మగౌరవం నినాదంతో పుట్టిన పార్టీ టీడీపీ అన్నారు. జయహో బీసీ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు బీసీలు బలహీనులు కాదని బలవంతులని కొనియాడారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బీసీల ద్రోహి అన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. 125 కులాలకు ఆర్థిక సాయం చేసిన పార్టీ టీడీపీ అన్నారు. రూ.వందల కోట్లు విలువచేసే పరికరాలను గోడౌన్‌లలో ఉంచిన ప్రభుత్వం వైసీపీ అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు బీసీలంతా ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతా'



తిమ్మప్పకు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సర్పంచు

మడకశిర రూరల్, జనవరి 5: వైసీపీ మోసాలకు లొంగనని, టీడీపీలోనే కొసాగుతానాని వైబీ హళ్ళి పంచాయతీ వార్డు సభ్యుడు తిప్పమ్మ తెలిపారు. ఆయన మాట్లాడుతూ తనకు అర్హతను బట్టి పింఛన్ మంజూరైందన్నారు. అయితే వైసీపీ నాయకులు గురువారం పింఛన్ ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి తనను మడకశిరలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన సమావేశంలో మంజూరైన ఫించన్ ఇచ్చి, ఇదే అదునుగా తీసుకోని తనకు ఇష్టం లేకపోయినా వైసీపీ కండువా వేశారన్నారు. శనివారం సర్పంచు రామాంజనేయులు, రవీంద్రారెడ్డి మళ్లీ తిమ్మప్పకు టీడీపీ కండువా వేసి పార్టీలోకి చేర్చుకున్నారు. వైస్ సర్పంచు అశ్వత్థనారాయణరెడ్డి, వెంకటరెడ్డి, లక్ష్మీనారాయణ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

లేపాక్షి, జనవరి 5: కంచిసముద్రం గ్రామంలో నిర్వహిస్తున్న గోందావళి సద్గురు బ్రహ్మ చైతన్య స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం బ్రహ్మ రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాక కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో సీతారాముల విగ్రహాలను ఏర్పాటుచేసి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఎలాంటి గొడవలు జరగకుండా ఎస్ఐ గోపీ బందోబస్తు నిర్వహించారు.



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామివారి రథం

అయ్యప్పస్వామి పడిపూజ

రొళ్ల, జనవరి 5: మండలంలోని బి.జి.హళ్లి అయ్యప్పస్వామి భక్త మండలి ఆధ్వర్యంలో వినాయకస్వామికి సుబ్రహ్మణ్య స్వామికి, మణికంఠ స్వామికి వివిధ పూల అలంకరణలతో ప్రత్యేకంగా అలంకరించి పడి పూజ నిర్వహించారు. వందలాది మంది భక్తులు వచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు అనంతరం అన్నదానం తీర్థప్రసాద వినియోగం గావించారు. అయ్యప్పస్వామి ఊరేగింపు, ఆర్కెస్ట్రాతో పాటు భక్తిపాటలు అందరినీ అలరించాయి. గురుస్వామి రాజప్ప, కెనెరా బ్యాంకు మేనేజరు నాగరాజు, యంజారప్ప స్వాములు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

పరీక్ష కేంద్రాల పరిశీలన

గోరంట్ల, జనవరి 5: పట్టణంలోని పలు పాఠశాలలను 10వతరతి, ఓపెన్ ఇంటర్ పరీక్షల నిర్వాహణ కోసం పదో తరగతి పబ్లిక్ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ లాజర్ శుక్రవారం పరిశీలించారు. పది, ఓపెన్ ఇంటర్ పరీక్షాకేంద్రల నిర్వహణ, సౌకర్యాల పరిశీలన కోసం ఆయన పాఠశాలలను తనిఖీ చేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో గదులు, మరుగుదొడ్లను పరిశీలించి, ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌తో చర్చించారు. అలాగే బాలికల ఉన్నత, ఉర్దూ పాఠశాలలు, శ్రీవివేకానంద, న్యూమాంటిసోరి, శ్రీచైతన్య ప్రైవేటు పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఎస్ఏపీఎస్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో ఓపెన్ ఇంటర్ పరీక్ష కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈకేంద్రంలో చిలమత్తూరు మండలం సోమగట్ట విద్యార్థులు పరీక్షలు రాసేవారు. తమకు సెంటర్ మార్చాలంటూ స్థానికులు అభ్యర్థించడంతో దీనిపై ప్రిన్సిపల్ సూర్యనారాయణతో ఆయన చర్చించారు.



బాలుర ఉన్నతపాఠశాల హెచ్ఎం గోపాల్‌తో చర్చిస్తున్న లాజర్

తాగునీటి ఎద్దడిని నివారిద్దాం: కమిషనర్

పెనుకొండ రూరల్, జనవరి 5: వేసవిని దృష్టిలో ఉంచుకుని వివిధ ప్రాంతాల్లో తాగునీరు అందించేందుకు కృషిచేస్తామని నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.06కోట్లతో షీప్‌ఫారం నుంచి పెనుకొండలోని వివిధ ప్రాంతాలకు తాగునీటిని అందించేందుకు పైప్‌లైన్ పనుల కోసం శుక్రవారం భూమి పూజ చేశామన్నారు.

అనుమానాస్పద స్థితిలో డ్రైవర్ మృతి

బత్తలపల్లి, జనవరి 5: మండలకేంద్రం సమీపంలో శుక్రవారం అనుమానాస్పద స్థితిలో డ్రైవర్ ఆనంద్ (45) మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తాడిమర్రికి చెందిన ఆనంద్ బొలేరో వాహన డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. కాగా గురువారం బొలేరోలో టమోటాలు వేసుకుని మదనపల్లికి వెళ్లాడు. అయితే శక్రవారం ఉదయం బత్తలపల్లిలోని తాడిపత్రి రోడ్డులో గల పెట్రోల్ బంకు సమీపంలో శవమై కనిపించాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్ఐ తన సింబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. భార్య ఓబుళమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆనంద్ బొలేరో వాహనాన్ని పెట్రోల్ బంకు సమీపంలో నిలిపి సమీపంలోని పొలంలో నిద్రిస్తుంటే ఎవరైనా చంపారా..? లేక ఎక్కడో చంపి మృతదేహాన్ని ఇక్కడికి తెచ్చి పడేశారా..? అనే సందేహాలను పోలీసులు వ్యక్తం చేశారు. మృతదేహాన్ని కొద్ది దూరం లాక్కెళ్లినట్లుగా ఆనవాళ్లు ఉన్నాయి. ఈ కేసును ఛేదించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.



పెనుకొండలో నాసిరకం చీరలు, సెల్‌ఫోన్లను ప్రదర్శిస్తున్న కార్యకర్తలు

మొక్కవోని దీక్ష

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 25 రోజులుగా మొక్కవోని దీక్షతో వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పెనుకొండలో నాసిరకం చీరలు, సెల్‌ఫోన్లు ప్రభుత్వం సరఫరా చేసిందని శుక్రవారం ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. సోమందేపల్లిలో ఒంటికాలిపై నిల్చుని ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని గోవిందా గోవిందా అంటూ వేడుకున్నారు. గోరంట్లలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. చిలమత్తూరు, అగళిలో నిరసన దీక్షలు కొనగాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమకు జీతాలు పెంచి ఆదుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు.



అగళిలో ఒంటికాలిపై నిరసన...



చిలమత్తూరులో...



గోరంట్లలో

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన



రోడ్డుపై పడుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

పెనుకొండ, జనవరి 5: సమస్యల పరిష్కారం కోరుతూ నగర పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 11వ రోజుకు చేరుకుంది. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికులు రోడ్డుపై పడుకుని తమ నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి రమేష్, తిప్పన్న, కార్మిక సంఘం నాయకులు వెంకటేష్, చంద్ర, నరసింహులు, తిప్పన్న, చిన్నవెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల వాడకంపై అవగహన

మడకశిర రూరల్ జనవరి 5: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎలక్ట్రానికి ఓటింగ్ యంత్రల వాడకంపై అవగాహన కల్పించారు. ఓటు వేసిన మూడు సెకన్లకు ఏ గుర్తుకు, సీరియల్ నెంబరుతో సహ యంత్రంలో ఓటర్లు చూసుకోవచ్చని ఎన్నికల అధికారి మారుతి ప్రసాద్ తెలిపారు. ఓటర్ల అవగాహన కోసం మడకశిరలో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.



ఈవీఎంల వాడకంపై అవగహన కల్పిస్తున్న ఎన్నికల అధికారి

ఇంటింటికి రాముడి అక్షింతల పంపిణీ



ఇంటింటికి అక్షింతలు పంచుతున్న ఆర్యవైశ్యులు

అగళి, జనవరి 5: మండల కేంద్రంలోని ఆర్యవైశ్యులు అయోధ్య రాముడి అక్షింతలు ఇంటింటికీ పంపణీ చేస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, ఫణిరాజు, శ్రీనివాసులు, రమేష్ తెలిపారు. అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవంలో భాగంగా ఈ అక్షింతల కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరం

ధర్మవరం, జనవరి 5: చదువుతో పాటు క్రీడలు చాలా అవసరమని ఆర్మీయట్రస్టు ఛైర్మన్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో శుక్రవారం అండర్-12 వ విభాగంలో బాస్కెట్‌బాల్ జిల్లా స్థాయి లీగ్ పోటీలు నిర్వహించారు. వీటిని శెట్టిపి జయచంద్రారెడ్డితో పాటు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులకు చదువు ఎంత అవసరమో క్రీడలు అంతే అవసరమన్నారు. క్రీడలు మానసిక, ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. ఈ పోటీలు ఆర్డీటీ, లీగల్ క్లబ్ సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ధర్మవరం బాలబాలికల జట్లతోపాటు అనంతపురానికి చెందిన ఎస్ఎస్‌బీఎన్ స్కూల్ బాలబాలికలు జట్లు, ఇండోర్ స్టేడియం బాల బాలికల జట్లు, బుక్కరాయసముద్రం జట్లు పాల్గొన్నాయి. పోటీల అనంతరం బాలికల విభాగంలో ధర్మవరం బాలికల జట్టు, బాలుర విభాగంలో ధర్మవరం బాలుర జట్టు విజేతలుగా నిలిచాయి. రొటేషన్ పద్ధతిలో ఈ లీగ్ పోటీలు తిరిగి అనంతపురంలోని ఇండోర్‌స్టేడియంలో జరుగుతాయి. కార్యక్రమంలో కోచ్‌లు సంజయ్, నరేంద్ర పాల్గొన్నారు.

బాలల ఉన్నత భవిష్యత్తుకు కృషి చేయాలి

● ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్

పుట్టపర్తిరూరల్, జనవరి 5: బాలల ఉన్నత భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్ సూచించారు. జిల్లాకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఇందుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం 18 ఏళ్ల వయసులోపు చిన్నారుల కోసం ఎన్నో సదుపాయాలను కల్పించిందన్నారు. అందుకు పెద్దమొత్తంలో నిధులు కూడా మంజూరు చేసిందన్నారు. బాలలహక్కుల పరిరక్షణ కోసం పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సత్యసాయి జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ సమితి ఏర్పాటైన నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించామన్నారు. రానున్న రోజుల్లో కలెక్టర్, ఎస్పీ నేతృత్వంలో బాలల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు వివరించారు. యూఎన్‌ఓ నిర్దేశించిన ఒడంబడికల మేరకు బాలలకు సంబంధించి జీవించే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, రక్షణ పొందే హక్కు, భాగస్వామ్యపు హక్కులపై అవగానహన కలిగి ఉండి సమష్టి కృషితో వాటిని పరిరక్షించాలని పేర్కొన్నారు. బాల్యవివాహాలను, చిన్నారులతో పనిచేయించడాన్ని తీవ్రనేరంగా భావించాలని, అలాంటి వాటిని ప్రోత్సహించే వారిపై కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫోన్లు, బైకులు, టీవీలు, మత్తుపదార్థాల వాడకం వంటివాటికి తల్లిదండ్రులు పిల్లలను దూరంగా ఉంచాలని సూచించారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చెర్మన్ రామలక్ష్మి, సభ్యురాలు కామేశ్వరి, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

లేపాక్షి శిల్పకళ అద్భుతం

లేపాక్షి, జనవరి 5: దుర్గా వీరభద్రస్వామి ఆలయంలోని శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని పాలిటెక్నిక్ సాంకేతిక శాఖ కమిషనర్ నాగరాణి అన్నారు. శుక్రవారం ఆమె ఆలయాన్ని సందర్శించారు. ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్థాంతరంగా ఆగిన కళ్యాణ మండపం, సీతాదేవి పాదం, వేలాడే స్తంభాన్ని చూసి ఆనాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. అనంతరం దుర్గా, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. అనంతరం అర్చకులు ఆమెను దుశ్శాలువతో సన్మానించారు.



కమిషనర్‌ను ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకుడు

ముందస్తు సంక్రాంతి సంబరాలు



హరిదాసుల వేషధారణలో చిన్నారులు

పెనుకొండ, జనవరి 5: స్థానిక ప్రగతి పాఠశాలలో కరస్పాండెంట్ శ్రీనివాసులు, హెచ్ఎం మంజువాణి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పాఠశాల విద్యార్థులు తెలుగు సంప్రదాయ పద్ధతి వేషధారణలో హరిదాసు వేషధారణలతో పాఠశాలలకు హాజరయ్యారు. పాఠశాల ప్రాంగణాన్ని రంగు రంగుల ముగ్గులతో అలంకరించారు. మామిడి తోరణాలు కట్టి అరటి చెట్లతో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా పాఠశాలను అలంకరించారు. సంక్రాంతి పండగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం హరిదాసులకు భిక్ష వేయడం చిన్న పిల్లలకు బోటికలు వేశారు.

మోడల్ పేపర్ల పంపిణీ



మోడల్ పేపర్ పుస్తకాలతో పదో తరగతి విద్యార్థులు

పెనుకొండ, జనవరి 5 : యూటీఎఫ్ రాష్ట్ర శాఖ రూపొందించిన ఎస్ఎస్‌సీ మోడల్‌పేపర్లను మండలంలోని పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. శుక్రవారం యూటీఎఫ్ నాయకులు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, సెంట్రల్ ఉన్నత పాఠశాల బాలుర ఉన్నత పాఠశాల రాంపురం, మావటూరు పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. హెచ్ఎం జ్యోతిర్లత, రామక్రిష్ణ, దాళప్ప, జ్యోతి, మహిళ కన్వీనర్ హసీనాబేగం, రమేష్, ఉపేంద్ర, రామాంజనేయులు, ఆది, దినేష్, గాయిత్రి, లావణ్య పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనానికి భూమిపూజ

పెనుకొండ, జనవరి 5: పట్టణంలోని ఎగువగడ్డవీధిలో రూ.5లక్షల అంచనాతో కొత్తగా నిర్మించనున్న నాయీబ్రాహ్మణుల కమ్యూనిటీ భవనానికి శుక్రవారం నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ భూమిపూజ చేశారు. ఛైర్మన్ ఉమర్‌ఫరూక్, నాయీబ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, గౌరవాధ్యక్షులు ఎంసీ బాబు, ఉపాధ్యక్షులు ఆంజనేయులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న కమిషనర్ ఇతర అధికారులు

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అత్యధిక వడ్డీ

ఏపీజీబీ ఆర్ఎం

మడకశిరటౌన్, జనవరి 5: ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 8.3 శాతం అత్యధిక వడ్డీ ఇస్తున్న ఏకైక బ్యాంకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు అని రీజినల్ మేనేజర్ రవీంద్రారెడ్డి, జనరల్ మేనేజర్ సంజీవప్ప తెలిపారు. శుక్రవారం స్థానిక ఏపీజీబీ బ్యాంకుకు వచ్చిన సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. బ్యాంకు ఇప్పటిదాకా రూ.5200 కోట్ల టర్నోవర్ దిశగా పయనిస్తోందనీ, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.6000 కోట్లు సాధించేందుకు యత్నిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను అందిస్తున్న రీజినల్ మేనేజర్ తదితరులు

కన్నడలోనే బోర్డులు ఏర్పాటు చేయాలి

పావగడ, జనవరి 5: తాలూకాలోని ప్రతి దుకాణానికి కన్నడ నామ కన్నడ నామ పలకాలు ఏర్పాటు చేయాలని కర్ణాటక రక్షణ వేదిక ప్రవీణశెట్టి సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కర్ణాటకలో ఉన్న ఏ దుకాణానికైనా కన్నడలో నామపలకాలు అతికించాలని, రాసిన బోర్డులు ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా ఉండాలని వారు డిమాండ్ చేశారు. పట్టణంలో ప్రతి దుకాణానికి వెళ్లి ఇతర భాషలలో ఉన్న బోర్డులను తొలగించి కన్నడ పేర్లు ఉన్న బోర్డులను వారే సొంతంగా అతికించారు. కన్నడ రక్షణ వేదిక అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పాళేగార్ లోకేష్ పాల్గొన్నారు.

'ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు'



మాట్లాడుతున్న అంబికా లక్ష్మీనారాయణ

హిందూపురం, జనవరి 5: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హామీలు ఇచ్చిన ఈ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధిలేదని టీడీపీ నాయకులు మండిపడ్డారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు, డ్రైవర్లు చేస్తున్న నిరసన కార్యక్రమం శుక్రవారం మూడోరోజు కొనసాగింది. మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన శిబిరంలో టీడీపీ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్మోహన్‌రెడ్డి హామీలు గుప్పించారని అయితే ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. దీనివల్ల అన్నివర్గాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు అఖిల్‌రాజ్, వరదరాజులు, శ్రీనివాసులు, నాగలక్ష్మీ, రాధమ్మ దీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్‌కుమార్, డీఈ రమేష్, కౌన్సిలర్ సతీష్‌కుమార్, భారతి, మహాలక్ష్మి, నవీన్, హెచ్ఎన్ రాము, నాగరాజు పాల్గొన్నారు.

సాధుచెట్టి సంఘం అధ్యక్షుడిగా మంగేష్



మంగేష్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, జనవరి 5: హిందూపురం సాదుచెట్టి సంఘం అధ్యక్షుడిగా మంగేష్‌ను ఎన్నుకున్నట్లు కులస్తులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం కంచికామాక్షి కళ్యాణమండపంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ పురానికి రుణపడి ఉంటానన్నారు. కులం కోసం శక్తివంచనలేకుండా కృషిచేస్తానన్నారు. అనంతరం టీడీపీ నాయకులు ఆయనను సన్మానించారు. టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, డా.సురేంద్ర, కొల్లకుంట అంజినప్ప, రమేష్, అమర్నాథ్, ప్రియా గంగాధర్, డైమండ్‌బాబా, ప్రెస్ వెంకటేష్, నాగభూషణ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

లేపాక్షి, జనవరి 5: మండలంలోని కల్లూరు గ్రామంలో శుక్రవారం ఎస్ఐ గోపీ తనిఖీలు నిర్వహించగా ఓ మహిళ మద్యం అమ్ముతూ పట్టుబడింది. ఆమె వద్ద నుంచి 48టెట్రాప్యాకెట్లు, కొండూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద నుంచి 48 ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదుచేశామన్నారు.

రొళ్ల : వాహనాల తనిఖీలో భాగంగా మండల కేంద్రంలో కర్ణాటక మద్యం పట్టుకొన్నట్లు ఎస్ఐ మధు రామచంద్రుడు తెలిపారు. రత్నగిరి గ్రామానికి చెందిన రామచంద్రప్ప అనే వ్యక్తి వద్ద నుంచి 50 ఒరిజినల్‌ఛాయిస్ విస్కీ మద్యం ప్యాకెట్లు లభ్యంకాగా అతనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మట్కా బీటరు అరెస్టు

మడకశిరటౌన్, జనవరి 5: పట్టణంలోని హిందూపురం రోడ్డు హెయిర్ సెలూన్‌లో తిప్పేస్వామి మట్కా రాస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం మట్కా పట్టీలు రాస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేసి రూ.7520, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

మెడిసిన్ విద్యార్థి అదృశ్యం

పావగడ, జనవరి 5: పట్టణంలోని ధర్మవరం లేఔట్‌లో నివసిస్తున్న శ్రీబాబుప్రసాద్ శ్రీలక్ష్మి దంపతుల కుమారుడు దర్శన్‌కుమార్ వారం రోజుల క్రితం అదృశ్యమైనట్లు పావగడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ గురునాథ్ తెలిపారు. కుందుర్పి మండలం జంబుగుంపుల పాళ్యం గ్రామానికి చెందిన శ్రీబాబుప్రసాద్ పావగడ పట్టణంలోని ధర్మవరం లేఔట్‌లో నివాసం ఉండగా వీరి కుమారుడు దర్శన్‌కుమార్ దావణగెరెలోని ఎస్ఎస్ఐఎంఎస్ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ చేస్తుండేవాడని, చదువుపై ఆసక్తి ఉండి ఏకాగ్రతతో చదవడం వల్ల మతిమరుపు అధికమై మొదటి సంవత్సరంలో మూడుసార్లు ఫెయిల్ అయ్యాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. మానసిక వ్యాధికి గురై వారం రోజుల నుంచి కనిపించకపోయాడని, ఇతని ఆచూకీ తెలిస్తే 7989022523, 08136-24555 నెంబర్లకు సామాచారం అందించాలని ఆయన కోరారు.



దర్శన్‌కుమార్ (ఫైల్)

మూర్ఛ వ్యాధి చికిత్స శిబిరాన్ని వినియోగించుకోండి

పెనుకొండ, జనవరి 5: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 28వ తేదీన స్థానిక ఘనగిరి పాఠశాలలో నిర్వహించే ఉచిత మూర్ఛవ్యాధి చికిత్స శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి హరీ, నబీ, ఇమ్రాన్‌బాషా, కోగిర జయచంద్ర కోరారు. శుక్రవారం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో మూర్ఛవ్యాధి శిబిరానికి సంబంధించిన పోస్టర్లను డా.రోహిత్‌కుమార్ చేతులమీదుగా విడుదల చేశారు. అవసరమైన వారు ముందుగానే పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9491355200, 9398913631, నెంబర్లను సంప్రదించాలన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

12న సామాజిక తనిఖీ ప్రజావేదిక

అగళి, జనవరి 5: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 12వ తేదీన జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్, ఏపీఓ శివన్న తెలిపారు. డిసెంబరు 26 నుంచి జనవరి 10వ తేదీ వరకు గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ పనులపై ప్రజావేదిక నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు ఉపాధి కూలీలు హాజరు కావాలని వారు కోరారు.